# ఊపిరి

"ఫలానా రాజకీయపార్టీ"

"వర్ధిల్లాలి"

"విద్యార్థి యూనియన్"

"జిందాభాద్"

విద్యార్థులు అరుస్తున్నారు. గుంపులు గుంపులుగా ఊరేగుతూ చేతులు ఆవేశంతో పైకెత్తుతూ నడుస్తున్నారు. వాతావరణం తీవ్రంగా ఉంది. విద్యార్థుల వెనకగా ఒక పోలీస్ వాన్ మెల్లగా వెడుతున్నది..

"విద్యార్థి యూనియన్"

"జిందాబాద్"

దారి పొడుగునా ప్రజలు అటూ, యిటూ నుంచుని ఈ ఊరేగింపును చూస్తున్నారు. ఆ ఉద్యమాన్ని ఎంతమంది కోరుతున్నారో, ఎంతమంది వద్దనుకుంటున్నారోకానీ, మొత్తానికి అందరూ ఆ వూరేగింపు అలా వెడుతుంటే వింతగా చూస్తున్నారు.

ఊరేగింపులో అందరికన్నా ముందు వున్నాడు శేషగిరి. అతను విద్యార్థి నాయకుడు కాదుకానీ విద్యార్థులకు నాయకుడంతటి వాడు. అతను ఉత్సాహంగా, అన్ని ఉద్యమాలు నడిపిస్తుంటాడు. అతని మిత్రులందరూ అతన్ని బలపరుస్తూ, ఉద్యమాలను విజయవంతం చేస్తుంటారు. యిప్పుడూ అతనే ముందుగా ఉన్నాడు. ఆవేశం ప్రస్ఫుటంగా కనపడుతున్నది. ఉడుకు రక్తం వురకలు వేస్తున్నదేమో మండిపోతున్న ఎండను కూడా లెక్కచేయక ఉషారుగా వెడుతున్నారు..

పోలీసులు కూడా జాగ్రత్తగా అన్నీ పరిశీలిస్తూ, మెల్లగా వెనకే వస్తున్నారు. పరిస్థితి

ఎక్కడ చేయి జారుతుందో, ఎప్పుడు ఏం జరుగుతుందో అనే భయం దాదాపు అందరిలోనూ ఉంది..

ఉత్సాహంగా అరుస్తున్న శేషగిరి ఒక్కసారిగా ఆగిపోయాడు. ప్రక్కనే నుంచునివున్న ఆయన్ని దీక్షగా ఒక్క క్షణం చూశాడు. ఆయన తెల్లటి కనుబొమ్మల క్రింద మెరుస్తున్న నల్లటి కళ్ళు..అతన్ని అదోలా చూశాయి. ఆ చూపులో మందలింపే వుందో, కోపమే వుందో కాని శేషగిరి వెంటనే తల దించుకున్నాడు.

ఒక క్షణం ఆగి శేషగిరి తల ఎత్తాడు. ఆయన యింకా అతని కళ్ళలోకే దీక్షగా చూస్తున్నారు. ఆయన కళ్ళల్లోకి చూడ లేకపోయాడు శేషగిరి. మళ్ళీ తల దించుకున్నాడు.

"విద్యార్ధి యూనియన్"

"జిందాబాద్"

వెనకవున్న విద్యార్ధులు అరుస్తున్నారు. అరుస్తూనే అతన్ని కూడా ముందుకు లాక్కుపోయారు.

రామసుబ్బయ్యగారి కళ్ళల్లో నీళ్ళు నిలిచినయి. అంతా మసక మసకగా కనపడుతున్నది. రాత్రి జరిగిన విషయం ఆ కన్నీళ్ళు నిండిన కళ్ళ ముందు కదలాడింది..

నిన్న రాత్రి రామసుబ్బయ్యగారు, ధర్మారావ్‌గారింట్లో వున్నప్పుడు జరిగిన విషయం అది....

"ఈనాటి విద్యార్ధులలో పూర్తిగా క్రమశిక్షణ నశించింది!"అన్నాడు ధర్మారావ్. ఆయన దృష్టిలో ఆయన సుపుత్రుడు శేషగిరి మెదిలాడు. రామసుబ్బయ్యగారు మాట్లాడలేదు. బహుశా రిటయిరవకముందు తన మాష్టరు ఉద్యోగంలో చూసిన రకరకాల విద్యార్ధులు గుర్తుకు వచ్చారు కాబోలు!

"ప్రతీదీ వాళ్ళకే కావాలి. తమ చదువు సంగతేదో చూసుకోక, ప్రపంచ రాజకీయాలన్నీ వాళ్ళకే కావాలంటారు!" ధర్మారావ్ మళ్ళీ అన్నాడు.

అప్పుడే వచ్చి వెనకగా నుంచున్న కొడుకు శేషగిరిని ఆయన గమనించలేదు.

"ఉదాహరణకు మా శేషగిరినే తీసుకోండి..ఇప్పటిదాకా ఎన్నిసార్లు వాడు చదువులో వెనకపడిపోయాడు..అప్పుడు స్టీల్ ప్లాంట్ యాజిటేషన్ చేశారు. ఫలితంగా క్లాసులు నష్టపోయారు. కానీ జరిగిందేమిటి? పెద్ద ఎత్తున వస్తుందనుకున్న స్టీల్ ప్లాంట్ మూడు ముక్కలయింది. మిగతా రాష్ట్రాలవారు విద్యార్ధుల ఆందోళనలేం లేకుండానే స్టీల్ ప్లాంట్ సంపాదించుకోగలిగారు. హిందీ యాజిటేషన్ అన్నారు. క్లాసులు పోగొట్టుకున్నారు. సాధించిందేమిటి? 'జై ఆంధ్రా' ఉద్యమంలో ఎంత నష్టపోయారు? కానీ సాధించిందేమిటి? దీన్ని బట్టి తెలుస్తున్న దేమిటంటే విద్యార్ధులు క్లాసులు ఎగ్గొట్టి గొడవలు చేస్తే ఫలితం లేదని. రైళ్ళూ, బస్సులు, పోస్టాఫీసులూ తగలబెడితే ఏమీ లాభం లేదని..."

శేషగిరి ముందుకు వచ్చాడు. వాళ్ళ నాన్న కూర్చున్న కుర్చీ ప్రక్కగా వచ్చి నుంచున్నాడు.

ధర్మారావ్ శేషగిరిని చూసి అదోలా నవ్వాడు, "వచ్చావా, నీ గురించె మాట్లాడు కుంటున్నాం..కూర్చో!" అన్నాడు.

"గిరీ, ఒక నిముషం కూర్చో...మేమిద్దరం నీతో మాట్లాడాలనుకుంటున్నాం!"

శేషగిరి నవ్వాడు. "మాష్టారూ...మాట్లాడటం అంటే కొన్ని నీతులు చెప్పటమే కదూ!" అన్నాడు.

"కూర్చో..చెబుతాను!" రామసుబ్బయ్యగారి పెదవుల మీద చిన్న దరహాసం మెరిసింది.

శేషగిరి కూర్చున్నాడు.

ధర్మారావ్‌గారు శేషగిరిని ఓ మారు చూసి నిట్టూర్చారు.

రామసుబ్బయ్యగారు చిన్నగా నవ్వారు.

"గిరీ! ఇందాక అంతా విన్నానన్నావ్! ఏం విన్నావ్?"

"మాష్టారూ, విద్యార్థులు చదువులు మానేసి, ఆందోళనలలో పడిపోయారనే కదా మీ బాధ...అది నిజమే మాష్టారూ...కానీ వాళ్ళలా ఎందుకు చేస్తున్నారో మీకు తెలీదా?"

ఏదో అనబోయిన ధర్మారావ్‌ను వారించారు రామసుబ్బయ్యగారు.

"కాదు! నువ్వు చెప్పు..వాళ్ళలా ఎందుకు చేస్తున్నారంటావ్?"

చిన్నగా నవ్వాడు శేషగిరి - "అదీ నా చేత చెప్పించాలనేగా మాష్టారూ..సరే చెబుతాను వినండి..ఇప్పుడు మన ప్రభుత్వం మీ చిన్నప్పుడు చూసిన ప్రభుత్వంలా లేదు మాష్టారూ..కుంభకర్ణుడిలా నిద్ర పోతున్నది. ప్రతీ చిన్న విషయం ప్రజలే గుర్తు చేయాల్సి వస్తున్నది..."

"ఇది ప్రజా ప్రభుత్వం కదా మరి..ప్రజలే తమకు కావాలసినవి చెప్పిచేయించుకోవాలి మరి..ఏం మాష్టారూ!" ధర్మారావ్ అన్నాడు.

రామసుబ్బయ్యగారు మాట్లాడలేదు.

శేషగిరి వేపు చూసి "ఊ!" అన్నారు.

"అందుకని ప్రభుత్వానికి రాయబారాల ద్వారాను, రిప్రజంటేషన ద్వారాను చెబుతుంటే, ప్రభుత్వం ఏమీ పట్టనట్టుగా ఉంటున్నది. అందుకనే ఈ విధమైన ఆందోళనలు చేస్తున్నాం. అప్పటికిగాని ప్రభుత్వం మా గోడు వినిపించుకోవటం లేదు. ప్రభుత్వానికి ఒక విధంగా అది అలవాటయిందేమో కూడాను. ప్రతీ చిన్న విషయానికి పెద్ద ఆందోళన అవసరమవుతున్నది ఈ కాలంలో..."

"ఈ విధమైన ఆందోళనల వల్ల మీరేమయినా సాధించగలరా చెప్పు శేషగిరీ!"

"ఎందుకు సాధించలేం మాష్టారూ..సివిల్ డిస్‌ఒబీడియన్సు..గాంధీగారు ప్రారంభించినదేగదా.. ఆ సత్యాగ్రహమే కదా మనకు స్వాతంత్రం సంపాదించి పెట్టింది!"

ధర్మారావ్ కొంచెం మందలింపుగా అన్నాడు - "శేషగిరీ తెలిసీ తెలియనివి

మాట్లాడకు. ఆనాటి సత్యాగ్రహం పూర్తిగా వేరు. ఆనాటి లక్ష్యం ఏమిటి? ఎవరి మీద చేశాం? ఆ సత్యాగ్రహం - యిప్పుడు మీరు చేస్తున్న సత్యాగ్రహం అలాటిదా..ఆనాటి సత్యాగ్రహం త్యాపరులు చేసినదయితే.. ఈనాటి సత్యాగ్రహాలు స్వార్థపరులు చేయిస్తున్నవి..." ఆవేశంగా అన్నాడేమో ఆయన కంఠంలో వణుకు బాగా తెలుస్తున్నది.

"అవును గిరీ..మీ నాన్నగారు స్వయంగా స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న వ్యక్తి. బ్రిటీష్ వారి చేతిలో చావు దెబ్బలు తిని, జైలు పాలయి, సర్వం త్యాగం చేసి స్వరాజ్యం వచ్చేదాకా నిద్ర పోని మహావ్యక్తి...ఆయనకా నువ్వు సత్యాగ్రహం గురించి చెబుతున్నది?" అన్నారు రామసుబ్బయ్యగారు.

"కానీ మాష్టారూ..."

"గిరీ.. నేను ఒకటి అడుగుతాను చెప్పు. మీరు యింతకు ముందు చేసిన ఆందోళనలలోనూ, ఈనాడు చేస్తున్న ఆందోళనలలోనూ, ఎన్నోరైలు స్టేషన్లు తగలబెట్టారు. బస్సులు తగలబెట్టారు. పోస్టాఫీసులు తగలబెట్టారు. అంతేకాదు, చాలా షాపులు లూటీ చేశారు. అద్దాలు పగలకొట్టారు. దీనివల్ల మీరు నిజంగా సాధించిందేమిటి? నిజంగా నష్టపోయిందెవరు?"

"ప్రభుత్వం ఆస్తులు నష్టపోతేకానీ, ప్రభుత్వం అసలు విషయాలు పట్టించుకోవటంలేదు. అందుకనే మేమలాచేస్తున్నాం"

"సరే బాగుంది..మీరు రైలు పెట్టెలు తగలబెట్టారు. బస్సులు నాశనం చేశారు. అందువల్ల మనకు స్టీల్ ప్లాంటు వచ్చిందా? అందువల్ల హిందీని రాజభాషగా రద్దు చేశారా? అందువల్ల ప్రత్యేక రాష్ట్రం వచ్చిందా?" అడిగారు రామసుబ్బయ్యగారు.

గిరి మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నాడు.

"అంతేకాదు..ప్రభుత్వపు ఆస్తులు నష్టపోతేకాని లాభం లేదంటున్నావ్. ప్రభుత్వం అంటే ఏమిటి గిరీ..మళ్ళీమనమే. ఆ నష్టం ప్రజల సొమ్మే ..మన సొమ్ము మనమే నాశనం చేసుకుంటున్నాం.. రేపు ఆ నష్టాన్ని భర్తీ చేయటానికి మన మీద ఎక్కువ పన్నులు వేస్తారు. ఈనాడు నువ్వు పాడుచేస్తున్న ప్రతీ రైలు పెట్టె నీ సొమ్మే..అటువంటప్పుడు నీ కళ్ళు నువ్వే పొడుచుకుని యిక సాధించేదేమిటి శేషగిరీ?"

"మరేం చేయమంటారు మాష్టారూ.." అడిగాడు శేషగిరి.

ధర్మారావ్ అన్నాడు..."నే చెబుతాను వినరా..అసలు స్టూడెంట్సుకి రాజకీయాలు పనికిరావంటాను..ముందు వాళ్ళ చదువు పూర్తి చేసిన తర్వాతే మిగతా విషయాలు ఆలోచించా లంటాను!"

" నో ధర్మారావ్, ఆ విషయం నేను ఒప్పుకోను. భారత పౌరుడిగా ప్రతి ఒక్కడూ తన చుట్టూ జరుగుతున్నదేమిటో, తమ కర్తవ్యమేమిటో తెలుసుకోవాలంటాను నేను. విద్యార్థులకు రాజకీయాలు చాలా అవసరం. ఈనాటి విద్యార్థులే రేపటి దేశనాయకులు ధర్మారావ్. ఆనాడు ఎందరో త్యాగధనులు ప్రాణాలర్పించి మన దేశానికి స్వాతంత్రం

సంపాదించగలిగారు. ఈనాడు కొందరు స్వార్థపరులూ, అవినీతిపరులూ, స్వలాభంతో దేశాన్ని, దేశస్వాతంత్రాన్ని కబళించాలని ప్రయత్నం చేస్తుంటే ప్రతిఘటించవలసింది ఈ నవయువకుల! ఈనాటి విద్యార్థులే! భారతదేశం ప్రగతికి నవయువకులే ఊపిరి. వాళ్ళ వేడి రక్తమే దేశానికి రక్ష కావాలి. అవును రక్ష కావాలి!" రామసుబ్బయ్యగారు ఆగారు. ఆయన కళ్ళల్లో నీళ్ళు నిలిచినయి. ఆయన మాటల వెనకాల, మనసు వెనకాల, చాలా బాధ, ఏ భాషకూ అందని భావం ప్రస్ఫుటంగా కనపడింది.

"ఏమిటి మాష్టారూ..కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు!" మాష్టారు భుజంమీద చేయి వేశాడు ధర్మారావ్..

శేషగిరి నిశ్చలంగా నిలబడ్డాడు మాష్టారిని చూస్తూ.

రామసుబ్బయ్యగారు అయిదు నిముషాలు మాట్లాడలేదు. తర్వాత మెల్లగా అన్నారు.."నేను వృత్తి రీత్యా ఉపాధ్యాయుడిని శేషగిరీ. వ్యక్తిగతంగా మానవతావాదిని. ప్రతీ విద్యార్థి, ప్రతీ యువకుడూ, నా బిడ్డ క్రిందే లెఖ్ఖ నాకు. ఎవరికి ఏ మాత్రం అన్యాయం జరిగినా నా హృదయంలో ఆ బాధ ముల్లులా గుచ్చుకుంటుంది. ఈ ఆందోళనల వల్ల అన్నెం పున్నెం ఎరుగని అమాయకులు ఎందరు మరణిస్తున్నారో రోజూ చూస్తున్నాం. కానీ విద్యార్థులు చేసే ప్రతీ ఆందోళన వెనకా ఎన్ని స్వార్థపర రాజకీయ శక్తులు ఉన్నాయో ఎంతమంది స్వప్రయోజనకారులు పనిచేస్తున్నారో, ఉడుకు రక్తం వురకలు వేస్తున్న మీ కుర్రాళ్ళకి తెలియటంలేదు!"

శేషగిరి మాట్లాడలేదు.

"ఈనాడు అసలు దేశ స్వరూపమే మారిపోయింది. ఆ రోజుల్లో నిజంగా త్యాగం చేసి స్వతంత్ర సంపాదనలో పాల్గొన్నవారు ఈనాడు తిండికిలేక తిరుగుతున్నారు..నాయకులై దేశాన్ని దోచుకుంటున్నారు కొందరు..అనాడు మేము పడ్డ కష్టాలు తల్చుకొని ఈనాటి దేశ సౌభాగ్యాన్ని కళ్ళారా చూస్తుంటే గుండె తరుక్కుపోతుంది మాష్టారూ!" అన్నాడు ధర్మారావ్.

"అందుకనే విద్యార్థులు ముందుకు దూకాలనేది నేను" వెంటనే అన్నాడు శేషగిరి.

"ఎలా?" అడిగారు మాష్టారు.

ఏదో చెప్పబోయి ఆగాడు శేషగిరి.

ఒక క్షణం ఆగి "మీరే చెప్పండి మాష్టారు!" అన్నాడు.

"చెబుతాను..అన్నిటికన్నా మొదటి విషయం..సామాన్య మానవుడికి కావలసింది కనీసపు అవసరాలు తీరటం..తిండి,బట్టా, ఇల్లూ దొరికితే చాలు. అంతేకాని అతనికి కావలసింది పార్టీలు కాదు. ప్రభుత్వం ఏ పార్టీకి చెందింవదో అతనికి అనవసరం. ప్రభుత్వంఅతని నిత్యావసరాలు తీరుస్తే అదే అతనికి పదివేలు. కనుక మీరు ఎన్నికలలో ఎన్నుకోవలసింది ఏదో ఒక పార్టీ పేరుతో నుంచున్న అసమర్థులయిన మనుష్యులను కాదు..సమర్థులయినవారిని, ఏ పార్టీకి చెందినా మిమ్మల్ని సమర్థవంతంగా పాలించేవారినే

ఎన్నుకోవాలి.కులమత బేధాలతోనో, ధనవ్యామోహంతోనో పనికిమాలిన వాళ్లను ఎన్నుకుంటే రేపు దేశం స్మశానంలా తయారవుతుంది. మీరు నాయకులను ఎన్నుకున్నది ఎందుకు? మీ అవసరాలను వారికి చెప్పండి. యువకులంతా కలిసి మీ మీ నాయకులను కలిసి, వారితో మీ కష్టాలు చర్చించండి. మీ న్యాయమైన కోర్కెలకోసం పోరాడమనండి. అలా వినని వాడిని పదవిలోనుంచి క్రిందకు దింపండి. ప్రజల సంగతి పట్టనివాడు నాయకుడు కాదు..తర్వాత అవినీతిని అరికట్టండి - లంచాలను, కల్తీలను ఆపండి..నల్ల బజారును నడి బజారులో నగ్నంగా నిలబెట్టి కడిగేయండి..మీరందరూ ఒక్కొక్క గ్రూపుగా బయలుదేరి ఏయే వ్యాపారులు బ్లాక్ మార్కెట్ చేస్తున్నారో తెలుసుకోండి. పోలీసుల సహాయంతో వాళ్ళందర్నీ బయటకు లాగండి. ప్రభుత్వానికి సహాయపడండి. ప్రభుత్వంలోనూ పోలీసుల్లోనూ కూడా అవినీతి ఉంటే వెలికితీసి తేటతెల్లంగా చూపించండి..సామూహికంగా విద్యార్థులు యిలా అవినీతిని, లంచాన్నీ, కల్తీని అన్నిటినీ రూపుమాపండి. మీతోటి మనుషులలో మానవత్వాన్ని నింపండి. అదీ మీరు చేయవలసినపని. సామూహికంగా వచ్చే ఈ సంఘిక చైనత్యన్యాన్ని ఎవరూ ఆపలేదు. నవయువకుల రక్తంతో వేడిగా ప్రవహించే ఈ చైతన్య రధానికి అడ్డు వుండదు. ఈ దేశం మీది. ఎందరో మహానుభావులు కష్టపడి, ప్రాణాలర్పించి మీకు యిచ్చిన దేశం. దేశ సౌభాగ్యాన్ని పెంచుతూ దేశ ప్రగతిని ప్రపంచానికి చాటి చెప్పవలసినది మీరే. యిప్పుడు ఈ స్వార్ధపరులు దేశాన్ని నమిలి మింగేస్తే, రేపు బాధపడవలసింది మీరు. నష్టపోయేది మీరు. కనుక మీ భుజాల మీద ఎంత పెద్ద భారం ఉందో వూహించుకుని ప్రవర్తించండి. అంతే కాని ఏవో స్వార్ధపరశక్తుల చేతుల్లో నలిగి, మీ కళ్ళను మీరే పొడుచుకోకండి. మీ దేశ ప్రగతికి మీరే అడ్డురాకండి. మీ దేశపు సొమ్మును మీరే పాడుచేసుకోకండి. దేశ రక్షణ కోసం ప్రాణాలు యివ్వవలసిన మీరు, దేశ భక్షణలో స్వార్ధపరులకు సహాయపడకండి!" రామసుబ్బయ్యగారు ఆగారు. ఆయన కళ్ళల్లో ధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయి. రెండు చేతులతోనూ తల పట్టుకుని కూర్చుకున్నారు.

"ఏమిటి మాష్టారూ..ఏమయింది..మీ ఆరోగ్యం ఎలా ఉంది?" అన్నాడు ధర్మారావ్ ఆత్రుతగా..మాష్టారి భుజం మీద చేయి వేసి.

"ఏంలేదు..మనసులోని బాధ మరుపురాకుండా ఉంది" ఆగారు మాష్టారు.

"ఏమిటి మాష్టారూ! ఏమిటి మీరంటున్నది? ఏమిటి మీ మనసులోని బాద?" అడిగాడు ధర్మారావ్.

శేషగిరి ముందుకు వచ్చి మాష్టారి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"ఇప్పుడు కాదు! తర్వాత చెబుతాను! తర్వాత చెబుతాను" అంటూ రామసుబ్బయ్యగారు లేచి మెల్లగా భారంగా నడుస్తూ వెళ్ళి పోయారు.

శేషగిరి నినాదాలు చేస్తున్న విద్యార్థుల మధ్య నడుస్తున్నాడే కానీ, అతని కళ్ళ ముందు మాష్టారు అతన్ని యిందాక దీక్షగా చూసిన చూపే కనపడుతున్నది. మాష్టారు అలా ఎందుకు చూశారు? ఆయన కళ్ళు తెలిసీ తెలియని భాషలో అతనికి యిచ్చిన సంకేతం, సందేశం ఏమిటి? రాత్రి మాష్టారు అంత బాధపడడానికి కారణం ఏమిటి? అదే ఆలోచిస్తున్నాడు

శేషగిరి. రాత్రి మాష్టారు చెప్పినది నిజమేననిపించింది శేషగిరికి. ఏదో ఆవేశంలో గొడవచేయటమేకాని, తమ ఆందోళనలు సాధించినదేమిటి? పోయినసారి తమకు వేరే రాష్ట్రం కావాలన్నారు. ఎన్నో రైలు స్టేషన్లు నాశనం అయినయి. ఎన్నో పోస్టాఫీసులు తగలబెట్టబడ్డాయి. ఎన్నో బస్సులు నాశనం అయాయి. ప్రయాణ సౌకర్యాలు అన్నీ రద్దు అయినందువల్ల తమ తోటి ప్రజలే ఎన్నో యిబ్బందులకు గురి అయారు. స్వార్థపరులయిన నాయకులు ఎలా చీటికి మాటికీ మాటలు మారుస్తూ, పార్టీలు మారుతూ, తమ స్వంత భవిష్యత్తును జాగ్రత్తగా కాపాడుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు..వీరిలో నిజంగా, ఏ వ్యామోహమూ లేకుండా, ప్రజాక్షేమం కావాలనుకునే వారు ఎంతమంది? యిలాటి స్వార్థపరుల చేతుల్లో అమాయకులైన విద్యార్థులు ఎలా బలి అవుతున్నారు...

చటుక్కున వెనుతిరిగాడు శేషగిరి. చకచకా నడుస్తున్నాడు.

"ఎక్కడికి!" అడిగాడు మిత్రుడు.

"చెబుతాను! నాతోరండి..మీరూ వెనక్కిరండి!"

నమ్మకం వున్న విద్యార్థులందరూ వెనుదిరిగారు. "ఏమిటి శేషగిరీ!" అంటూ అతనిమీద నమ్మకం లేని విద్యార్థులు కూడా వెనుదిరిగారు.

శేషగిరి దారిలో ఏమీ మాట్లాడలేదు. మిగతా విద్యార్థులు గుసగుసలతో అతని వెంట నడిచారు.

శేషగిరి సరాసరి రామసుబ్బయ్య మాష్టారి యింటి కెళ్ళాడు. ఆయన బయట మంచం మీద పడుకుని ఉన్నారు.

"మాష్టారూ! మేము వెనక్కి వచ్చేశాం మాష్టారూ!" అన్నాడు.

ఆయన బలహీనంగా కళ్ళు తెరిచారు. అంత బలహీనంగా ఉన్నా ఆయన కళ్ళు అదో విధమైన ఉత్సాహంతో వింతగా మెరిశాయి.

"మీరు రాత్రి చెప్పిందంతా నిజమే మాష్టారూ! నేనే కాదు ప్రతీ విద్యార్థీ మీరు చెప్పినట్టే చేస్తాం. మా దేశాన్ని మేం కాపాడుకుంటాం. పెద్దలు మాకిచ్చిన ఈ భూమిని ఎవరూ కబళించటానికి వీల్లేదు!" అన్నాడు శేషగిరి.

మాష్టారు తృప్తిగా నవ్వారు.

"ఈనాడు విద్యార్థులలో పెరిగిపోయిన అసంతృప్తి, ప్రజలలో పెరిగిపోయిన బ్రతుకు భయం పోగొట్టగానికి మీరు చెప్పినదే సరియైన పద్ధతి. విద్యార్థులందరం కలిసి మీరు చెప్పిన సాంఘిక చైతన్యాన్ని అమలు పరుస్తాం. ఈనాడే నవయువకుల చైతన్యరథం, దేశంలోని స్వార్థపరుల, ధనమదాంధుల దుష్కృత్యాలను రూపుమాపటానికి కంకణం కట్టుకుంటున్నది" ఆవేశంగా అన్నాడు శేషగిరి.

రామసుబ్బయ్యగారు అన్నారు" - చాలా మంచి వార్త చెప్పావ్ గిరీ..దేశరక్షణే మీకు ముఖ్యం. విదేశ శత్రువులు ఎంత భయంకరమైనవారయినా, మనం తరిమికొట్టాం. మన ధైర్యం సాహసాలు అలాటివి. కానీ దేశంలోనే వున్న మన దేశానికి చెందిన స్వార్థపరులు

యింకా భయంకరమైన శత్రువులు. వాళ్ళు దేశాన్ని కబళించటానికి సిద్ధంగా ఉన్నారు. వారినుండి కూడా దేశాన్ని రక్షించవలసిన బాధ్యత ఉంది...దేశ రక్షణ కోసం ప్రాణాలను యివ్వటానికయినా సిద్ధపడాలి గిరీ, సిద్ధపడాలి!" అంటూనే చేతుల్లో తల దాచుకుని విలపించారు మాష్టారు.

గిరి ముందుకు వెళ్ళి రామసుబ్బయ్యగారి భుజాలు పట్టుకున్నాడు - "మాష్టారూ! ఏమిటి మాష్టారూ..ఎందుకలా బాధపడుతున్నారు. అసలు ఏం జరిగింది?"

ఆయన మాట్లాడలేదు మౌనంగా కళ్ళు తుడుచుకున్నారు.

"చెప్పండి మాష్టారూ..మీ కష్టాలు నాతో చెప్పండి. నేను మీ అబ్బాయి రామకృష్ణలాటివాడిని మాష్టారూ..అతను నాకు ప్రియమిత్రుడే కాక, మీరూ నాకు పితృతుల్యులు"

అతని మాటలు పూర్తవకుండానే మాష్టారి డెబ్బయి అయిదు సంవత్సరాల వయస్సుగల తెల్లటి కళ్ళూ మళ్ళీ వర్షించాయి.

"ఏంజరిగింది మాష్టారూ..చెప్పరూ!" అన్నాడు గిరి.

"చెబుతాను గిరీ! యిక నేను ఆ విషయాన్ని హృదయంలో ఉంచుకోలేను.. విను"

ఒక్క క్షణం ఆగి మాష్టారు అన్నారు - "గిరీ, నా ఏకైక పుత్రుడు రామకృష్ణ నీ జీవితానికి ఆశ, శ్వాస అయిన రామకృష్ణ మాయింటి వెలుగు, కంటిపాప అయిన రామకృష్ణ, దేశ సరిహద్దుల్ని కాపలా కాస్తూ శతృవుల చేతుల్లో మరణించాడు..దేశరక్షణ యజ్ఞంలో ప్రాణం పోగొట్టుకున్నాడు!"

గిరికి ఒక క్షణం మాటలు రాలేదు. తర్వాత అన్నాడు.

"మీ మనసులోని బాధ అర్థమయింది మాష్టారూ.. మీ అబ్బాయి దేశ రక్షణలో అమరుడయి, మీ హృదయంలో వదలిన ఖాళీని మేము భర్తీ చేస్తాం. ప్రతీ విద్యార్థీ మీ పుత్రుడే మాష్టారూ! రామకృష్ణ విదేశ శత్రువుల నుండి దేశ రక్షణలో ప్రాణాలు విడిస్తే మేమంతా మన దేశంలోనే మనతోనేవున్న శత్రువుల నుండి దేశాన్ని రక్షించటానికి ప్రాణాలివ్వడానికి కూడా వెనుదియ్యం మాష్టారూ.. అవినీతి, అరాచకం, కల్తీ, లంచం, నల్లబజారు, ధనమదాంధుల దౌర్జన్యం, దోపిడి అన్నిటినీ రూపుమాపి మేం చేయగలిగిందంతా చేస్తాం మాష్టారూ!"

మాష్టారు చేయి పైకెత్తారు - "మీరే దేశ ప్రగతికి ఊపిరి బాబూ! మీరు తప్పుదారులు పడితే దేశం వూపిరి పీల్చుకోవటం ఆగిపోతుంది కనుక దేశం కళకళ లాడాలంటే మీరే ముందుకు రావాలి. అనాడే సామాన్య భారతీయుడి జీవితం ఆనందమయంగా ఉంటుంది!"

శేషగిరిలోనూ, అక్కడ చేరిన విద్యార్థులలోనూ ఏదో ఆవేశం, పులకింత కలిగింది. రెట్టించిన చైతన్యంతో మాష్టారుకి మనస్ఫూర్తిగా నమస్కరించారు.